పారదర్శక పాలన అందిస్తాం

- ప్రజల అవసరాలు గుర్తించి పని చేస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన రైతు భరోసా అభిప్రాయ సేకరణ కోసం మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి వచ్చిన ఆయన, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కొద్దిసేపు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో మంచి పాలన అందించాలని, అధికారులు న్యూట్రల్‌గా వ్యవహరించాలని ఆదేశాలు ఇస్తానని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అవినీతి రహిత పాలనను అందిస్తామని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి పేద వారికి అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయంపై 66 శాతం జనాభా ఆధారపడి ఉన్నట్లు గుర్తించామని, రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ శాఖ వాటా 16 శాతంగా గుర్తించామని అందుకే ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15లోపు మొత్తం రుణమాఫీ చేస్తామన్నారు. రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తున్నామని, త్వరలో కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు జారీ చేస్తామని అన్నారు. ఇంత కాలం ఆరోగ్యశ్రీ కార్డు రేషన్ కార్డుతో లింక్ ఉండేదని, ఇపుడు దేని కార్డు దానికే ఇస్తామన్నారు.

మూడేళ్లు.. ఏడుగురు ఎస్ఐలు

- పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో తరుచూ బదిలీలు
- వాస్తు దోషం ఉన్నదని ప్రచారం

పెగడపల్లి, జూలై 19: పెగడపల్లి ఠాణా పోలీస్ అధికారులకు అచ్చిరావడంలేదు. మూడేండ్లలో ఏడుగురు ఎస్ఐలు బదిలీ కావడం, ఇటీవల ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడికి వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్ పది రోజులైన బాధ్యతలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. పోలీస్‌స్టేషన్‌కు వాస్తు దోషం కారణంగా ఇక్కడకు వచ్చిన ఎస్ఐలు స్వల్పకాలంలోనే ట్రాన్స్‌ఫర్ అవుతున్నారని ప్రచారం జరుగుతున్నది. 2021 ఫిబ్రవరిలో ఎస్ఐ నవత బదిలీపై వెళ్లగా, అదే నెలలో శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. కేవలం మూడు నెలలు మాత్రమే ఇక్కడ పనిచేసి మేలో బదిలీపై వెళ్లారు. అదే నెలలో బాధ్యతలు చేపట్టిన అశోక్, కేవలం ఐదు నెలలే పనిచేసి అక్టోబర్‌లో ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన ఎస్ఐ శ్వేత మాత్రం 15 నెలల పాటు విధులు నిర్వర్తించారు. 2023 జనవరిలో ఆమె ట్రాన్స్‌ఫర్ కాగా, ఏప్రిల్‌లో కుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఆయన రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే జూన్‌లో బదిలీపై వెళ్లిపోయారు. అదే నెలలో జాయిన్ అయిన సతీశ్ ఎనిమిది నెలలు మాత్రమే పనిచేసి, 2024 ఫిబ్రవరిలో ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన ఎస్ఐ రామకృష్ణ ఐదు నెలలు మాత్రమే పనిచేసి ఈ నెల 10న బదిలీ అయ్యారు. కాగా, పది రోజుల కిందట ఆదిలాబాద్ నుంచి బదిలీపై వచ్చిన సీహెచ్ రవికిరణ్ ఇప్పటివరకు బాధ్యతలు తీసుకోలేదు. ఉద్యోగ రీత్యా బాధ్యతలు తీసుకున్న అధికారి ఒక్క చోట రెండేళ్లపాటు పాటు విధులు నిర్వర్తించాల్సి ఉన్నా, పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో మాత్రం మూడేళ్లలోనే ఏడుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. స్టేషన్‌కు వాస్తు దోశం ఉన్నదని కొందరు, ఇక్కడి రాజకీయ నేతల ఒత్తిళ్లే కారణమని మరికొందరు పేర్కొంటున్నారు.

సాగుకు ముందే ఇవ్వాలి

- కౌలు రైతులకూ రైతు భరోసా వర్తింపజేయాలి
- అభిప్రాయ సేకరణలో రైతుల మనోగతం

మాట్లాడేందుకు అవకాశమివ్వాలని మంత్రికి దండం పెడుతున్న రైతు

కార్యక్రమానికి హాజరైన రైతులు

కరీంనగర్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ప్రతి సీజన్‌లో సాగుకు ముందే రైతు భరోసా అందేలా చూడాలని, కౌలు రైతులకూ వర్తింపజేయాలని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులతో స్థానిక వీ కన్వెన్షన్ హాల్‌లో అభిప్రాయ సేకరణ జరిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల రైతులు తమ అభిప్రాయాలను పంచుకోగా, వారికి ఒక్క నిమిషం మాత్రమే సమయం ఇవ్వడం, మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో కొందరు అధికారులతో గొడవకు దిగారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సర్ది చెప్పడంతో గొడవ సద్దు మణిగింది. ఈ సందర్భంగా పలువురు రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మార్కెటింగ్ వరకూ ప్రోత్సహించాలి

పంట పెట్టుబడి సహాయం నుంచి మొదలుకుని కోత కోయడం వరకు, చివరికి మార్కెటింగ్ వరకు రైతులను ప్రోత్సహించాలి. రైతు భరోసా ఇచ్చి ఇతర రాయితీలు, బోనస్‌లు కల్పించకుంటే రైతులు నిరుత్సాహ పడతారు. విత్తనాలు కల్తీ లేకుండా చూడాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగే అక్రమాలను అరికట్టాలి.

- జోగినపల్లి సంపత్ రావు, బీకేఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

చిన్న సన్నకారు రైతులకే ఇవ్వాలి

రైతు భరోసా సహాయాన్ని రైతులకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్నింటికీ ఇవ్వద్దు. చిన్న సన్నకారు రైతులకే ఇవ్వాలి. రైతులకు బీమా పథకం తేవాలి. రైతు భరోసాను దుర్వినియోగం చేయకూడదు.

- నిశాంత్‌రెడ్డి, గొల్లపల్లి, (జగిత్యాల)

పెట్టుబడిసాయం ముందే ఇవ్వాలి

ఇది పంట సగానికి వచ్చిన తర్వాతనో, పంట తీసుకున్న తర్వాతనో ఇస్తే బాగుండదు. పంట సాగు చేసే ముందే అందించాల్సిన అవసరం ఉంది. రియల్ భూములకు, రాళ్ల రప్పలకు ఇవ్వకూడదు. ఏ రైతు పంట పండిస్తే ఆ రైతుకే ఇవ్వాలి.

- నారాయణ రెడ్డి, ఎలిగేడు (పెద్దపల్లి)

సేద్యం చేసే రైతులకే వర్తించాలి..

సేద్యం చేసే రైతులకే రైతు భరోసా ఇవ్వాలి. ఎప్పటికప్పుడు ప్రభుత్వం రైతులను ప్రోత్సహించాలి. రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే, పంట సాగు చేసిన రైతులకు అందితేనే బాగుంటుంది. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

- కూర రంగారెడ్డి, చెర్లభూత్కూర్, కరీంనగర్

ఒక్కరు కూడా నష్టపోవద్దు

రైతు భరోసా రైతులందరికి ఇవ్వాలి. ఏ ఒక్క రైతు నష్టపోవద్దు. అలాగే, రుణమాఫీ కూడా అందరికీ వర్తింపజే యాలి. రియల్ ఎస్టేట్ భూ ములు, రాళ్ల రప్పలకు రైతు భరోసా ఇవ్వకూడదు. రైతులకు సకాలంలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. అలాగే, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు కూడా ఇవ్వాలి.

- పెండ్యాల రాంరెడ్డి, ఈదులగట్టెపల్లి (మానకొండూర్)

గిట్టు బాటు ధర ఇవ్వాలి

రైతు భరోసా ఇవ్వడం గొప్ప విషయమే. అయితే, దీనితోనే సరిపెట్ట కూడదు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. బోనస్ ఇవ్వాలి. రసాయన ఎరువులు తగ్గించాలి. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి. సబ్సిడీపై చిన్న చిన్న పరికరాలు ఇవ్వాలి.

- శ్రీనివాస్ (వేములవాడ)

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

'భరోసా'తోపాటు బోనస్ ఇస్తాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

కరీంనగర్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రైతు భరోసాతోపాటు బోనస్ కూడా అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో రైతు భరోసాపై జరిగిన అభిప్రాయ సేకరణలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రైతు భరోసా ఎత్తేయండి, పండించిన పంటలకు బోనస్ ఇస్తే సరిపోతుందని కొందరు అభిప్రాయ పడుతున్నారన్నారు. అయితే, వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్న తమ ప్రభుత్వం ఈ రెండింటినీ అమలు చేస్తున్నదన్నారు. అంతే కాకుండా త్వరలో పంటల బీమా పథకాన్ని కూడా తెస్తున్నదని, దీనికి సంబంధించిన ప్రీమియంను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా తరుచూ మార్పిడి చేస్తే బాగుంటుందని సూచించారు. మంచి ఆదాయం వచ్చే పంటలవైపు మొగ్గు చూపాలన్నారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ పంట మంచి లాభదాయకంగా ఉందని, దీనిని తాను 1992లోనే సాగు చేశానని గుర్తు చేశారు. ఈ పంట సాగు చేసే రైతులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా నిత్యం ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్రంలో రైతులు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతుల అభిప్రాయాలు సేకరించిన తర్వాతనే రైతు భరోసా అమలు చేస్తామని చెప్పారు. రియల్ భూములు, రాళ్ల రప్పలకు రైతు బంధు ఇవ్వవద్దని రైతులు చెబుతున్నారని తెలిపారు. ఐటీ రిటర్న్ చేసే వాళ్లకు రుణమాఫీ వర్తించదని, రేషన్ కార్డు ఉంటేనే వర్తిస్తుందనే అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. భవిష్యత్తులో రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల విషయంలో పేదల్లో కడు పేదలను గుర్తించి ప్రయోజనాలు చేకూర్చుతామని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చింతకుంట విజయరమణారావు, ఠాకూర్ మక్కాన్ సింగ్, నాలుగు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

రైతు భరోసా కోసం రైతులు వ్యక్తం చేస్తున్న ప్రతి విషయాన్ని నోట్ చేసుకున్నాం. విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటాం. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతాం.

- దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి

రైతుల అభిప్రాయం మేరకే..

రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసాను అమలు చేస్తాం. మా ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తుంది. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలకుతోడు మేధావుల సలహాలు, సూచనలు కూడా తీసుకుంటాం.

- పొన్నం ప్రభాకర్, మంత్రి

ఎంఫార్మసీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, జూలై 19 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎంఫార్మసీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేలో నిర్వహించిన ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in, http://103.119.113.107:82 లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

రాష్ట్రాభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర

- తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డ్ కీలకపాత్ర పోషించిందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల్ అన్నారు. 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాలలో నాబార్డ్ భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ఇంక్యుబేషన్ సెంటర్‌లతో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మాట్లాడుతూ..నాబార్డు ప్రోత్సాహంతో పంటలపైన కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, ఫిషరీస్ తదితర రంగాలద్వారా కూడా ఆదాయం గణనీయంగా పెరుగుతున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి తలసరి ఆదాయంలో 10వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ప్రస్తుతం మూడో స్థానానికి ఎగబాకిందన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌సీఏబీ అధ్యక్షుడు ఎం రవీందర్ రావు మాట్లాడుతూ.. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాబార్డ్ గ్రాస్ రూట్ స్థాయిలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

PUB/0702

ప్రొఫార్మా 10-1

బహిరంగ ప్రకటన

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:

సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్: బల్హార్షా-కాజీపేట్ సెక్షన్ మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ నిర్మాణం-ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు కి.మీ. 140.830 నుండి కి.మీ. 135.00 వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు KM/CH: 140.830m నుండి KM/CH: 135.000m వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య OHE మాస్ట్ Loc. 135/02 (km/Ch: 135/21.90) ఎస్‌సిఆర్ పరిధి నుండి OHE మాస్ట్ Loc. 140/36 (km/Ch: 140/830.90.10)వరకు 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: **10-08-2024**న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

ప్రొఫార్మా 10-2

(ACTM Para 21020, Vol II, Part I : Correction Slip No. 32, Dated 09-10-2020)

ac 25kV ట్రాక్షన్ ప్రారంభం

"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:

సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్: బల్హార్షా-కాజీపేట్ సెక్షన్ మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ నిర్మాణం-ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు కి.మీ. 140.830 నుండి కి.మీ. 135.00 వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు KM/CH: 140.830m నుండి KM/CH: 135.000m వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య OHE మాస్ట్ Loc. 135/02 (km/Ch: 135/21.90) ఎస్‌సిఆర్ పరిధి నుండి OHE మాస్ట్ Loc. 140/36 (km/Ch: 140/830.90.10)వరకు లైవ్ ట్రాక్షన్ వైర్ ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్లు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవల్‌కు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.**

లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తుని గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములనందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లు వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:

i) హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.

ii) వాహనములపై తీసుకెళ్లు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును.

iii) కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

A0894 డిప్యూటి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, సికింద్రాబాద్

స్టాక్ మార్కెట్లకు మైక్రోసాఫ్ట్ దెబ్బ

ముంబై, జూలై 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. రికార్డు స్థాయి గరిష్ఠాల్లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. మరోవైపు మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ పరిణామం భారతీయ మార్కెట్ల నష్టాలను మరింత పెంచింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 738.81 పాయింట్లు లేదా 0.91 శాతం పడిపోయి 81 వేల మార్కుకు దిగువన 80,604.65 వద్ద ముగిసింది. నిజానికి తీవ్ర ఒడిదొడుకుల్లోనే ట్రేడింగ్ సాగింది. ఒకానొక దశలో గురువారం ముగింపుతో చూస్తే 244 పాయింట్లకుపైగా ఎగిసి ఆల్‌టైమ్ హైని తాకుతూ 81,587.76 వద్దకు సూచీ వెళ్లింది. అయితే ఈ ఉత్సాహం ఎంతోసేపు నిలబడలేకపోయింది. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోవడంతో 844.36 పాయింట్ల నష్టాన్ని సెన్సెక్స్ మూటగట్టుకోవడం గమనార్హం. చివరకు కొంతమేర కోలుకున్నా.. నష్టతీవ్రత ఎక్కువగానే ఉన్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 269.95 పాయింట్లు లేదా 1.09 శాతం దిగజారి 24,530.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మునుపెన్నడూ లేనివిధంగా 24,854.80 స్థాయికి చేరినా.. నిలదొక్కుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే 292.7 పాయింట్ల మేర నష్టపోయింది. అయితే ఆఖర్లో కాస్త కోలుకున్నది. అంతకుముందు 4 రోజుల పాటు స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే కదలాడిన విషయం తెలిసిందే. సెన్సెక్స్ 1,446.12 పాయింట్లు లేదా 1.80 శాతం పుంజుకున్నది.

8 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల నష్టాల నేపథ్యంలో మదుపరుల సంపద ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో హరించుకుపోయింది. బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.8 లక్షల కోట్లదాకా ఆవిరైపోయింది. రూ.7,94,059.53 కోట్లు క్షీణించి రూ.4,46,38,826.75 కోట్ల (5.34 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. వరుస లాభాల మధ్య మదుపరుల సంపద రూ.455 లక్షల కోట్లనూ తాకిన సంగతి విదితమే.

రంగాలవారీగా..

మెటల్ రంగ షేర్లు అత్యధికంగా 4.11 శాతం పడిపోయాయి. కమోడిటీస్ 3.07 శాతం, చమురు-గ్యాస్ 2.87 శాతం, విద్యుత్తు 2.67 శాతం, ఆటో 2.53 శాతం, యుటిలిటీస్ 2.51 శాతం, రియల్టీ 2.44 శాతం, సేవలు 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా స్టీల్ షేర్ విలువ 5 శాతానికిపైగా దిగజారింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య.. అన్ని రంగాలనూ ప్రభావితం చేసింది. దీంతో ఆయా దేశాల స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది. ఆసియా దేశాల్లో ప్రధానంగా దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టాలను చవిచూశాయి. చైనా సూచీ లాభపడింది. అలాగే కీలక ఐరోపా మార్కెట్లలో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ సూచీలూ నష్టపోయాయి. గురువారం నష్టాల్లో ముగిసిన అమెరికా మార్కెట్లూ.. శుక్రవారం తీవ్ర ఒడిదొడుకుల్లో ట్రేడ్ అయ్యాయి. మైక్రోసాఫ్ట్ దెబ్బకు విమానయాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్యాంకింగ్, మీడియా రంగాల్లోనూ ఇబ్బందులు తలెత్తాయి. కాగా, భారతీయ స్టాక్ మార్కెట్లపై సాంకేతికంగా మైక్రోసాఫ్ట్ ప్రభావం లేదని బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు ప్రకటించాయి.

విప్రో లాభం 3 వేల కోట్లు

బెంగళూరు, జూలై 19: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన విప్రో ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,003.2 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 4.6 శాతం వృద్ధి కనబరిచినట్లు పేర్కొంది. కానీ, కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 3.8 శాతం తగ్గి రూ.21,963.8 కోట్లకు పరిమితమైంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ శ్రీని పల్లె మాట్లాడుతూ..ఈ ఏడాది లాభాలతో ఆరంభించినట్లు, ముఖ్యంగా బిలియన్ డాలర్ల కంటే అతి విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ బీమా(బీఎఫ్ఎస్ఐ), కన్జ్యూమర్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

ఏడాదిలోగా 12 వేల ఉద్యోగాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 10-12 వేల మంది సిబ్బందిని క్యాంపస్‌లతోపాటు ఇతర మార్గాల ద్వారా నియమించుకునే ఆలోచనలో విప్రో ఉన్నది. తొలి త్రైమాసికంలో 337 మంది చేరడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,34,391కి చేరుకున్నారు.

రిలయన్స్‌కు చమురు సెగ

- క్యూ1లో 5 శాతం తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ, జూలై 19: దేశంలో అత్యంత విలువైన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లాభాలకు చమురు సెగ గట్టిగానేతాకింది. రిఫైనింగ్ మార్జిన్లు తక్కువగా ఉండటంతోపాటు పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది. టెలికం, రిటైల్ రంగాలు రాణించినప్పటికీ మిగతా రంగాలు నిరాశాజనక పనితీరు కనబరిచాయి. దీంతో గడిచిన త్రైమాసికానికిగాను కంపెనీ రూ. 15,138 కోట్లు(ప్రతి షేరుకు రూ. 22.37) కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది వచ్చిన రూ. 16,011 కోట్లు(ప్రతిషేరుకు రూ.23.66) పోలిస్తే 5 శాతం తగ్గింది. జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.18,951 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.2.57 లక్షల కోట్లకు ఎగబాకింది.

రిటైల్ ఆకర్షణీయం

రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ ఆకర్షణీయమైన లాభాలను ప్రకటించింది. జూన్ త్రైమాసికానికిగాను రూ.75,615 కోట్ల స్థూల ఆదాయంపై రూ.2,549 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.69,948 కోట్ల ఆదాయంతో పోలిస్తే 8.1 శాతం వృద్ధి నమోదుకాగా, రూ. 2,436 కోట్ల నికర లాభంతో పోలిస్తే 4.63 శాతం ఎగబాకింది. గత త్రైమాసికంలో కొత్తగా 331 రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభించతో మొత్తం సంఖ్య 18,918కి చేరుకున్నాయి.

చమురు, గ్యాస్ వ్యాపారాలు బలహీనంగా ఉన్నప్పటికీ కన్జ్యూమర్ విభాగాలు రాణించాయి. డిజిటల్ సర్వీసెస్, రిటైల్ రంగాలకు కస్టమర్ల నుంచి ఆశించిన స్థాయిలో కంటే అధికంగా మద్దతు ఉండటంతో ఈ విభాగాలను మరింత వేగవంతంగా విస్తరించనున్నాం.

- ముకేశ్ అంబానీ, రిలయన్స్ సీఎండీ

- జియో కస్టమర్లు 48.18 కోట్ల నుంచి 48.97 కోట్లకు పెరిగాయి. సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై వచ్చే ఆదాయం రూ. 180.5 నుంచి రూ.181.7 పెరిగింది.
- తలసరి డాటా వినిమయం నెలకు 30.3 జీబీ లేదా రోజుకు జీబీ డాటా కంటే అధికంగా నమోదైంది.
- కంపెనీ రుణాలు రూ.1.16 లక్షల కోట్ల నుంచి రూ.1.12 లక్షల కోట్లకు తగ్గాయి.
- కేజీ బేసిన్‌లో రోజుకు 28.7 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నది.

జియో లాభం 5,445 కోట్లు

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో లాభాలతో కళకళలాడుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.5,445 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 12 శాతం ఎగబాకింది. వరుస త్రైమాసికాలతో పోలిస్తే 2 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10 శాతం ఎగబాకి రూ.26,478 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది.

వాణిజ్య

రూపాయికి చిల్లులు

7 పైసలు పడిపోయిన విలువ

ముంబై, జూలై 19: రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. మరో 7 పైసలు తరిగిపోయి 83.70కి జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతోపాటు ఈక్విటీ మార్కెట్లు ఢీలా పడటం కరెన్సీ పతనానికి ప్రధాన కారణమని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. గ్లోబల్ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమనడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగిందని, ఆర్బీఐ జోక్యం చేసుకున్నప్పటికీ పతనం మాత్రం ఆగలేదు. 83.64 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 83.60 గరిష్ఠ స్థాయికి చేరుకోగా, 83.70 కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివరకు 7 పైసలు తగ్గి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు అయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరిస్తుండటం, రూపాయి పతనానికి అడ్డుకట్ట వేయడానికి ఆర్బీఐ చర్యలు తీసుకుంటేనే తిరిగి కోలుకునే అవకాశాలున్నాయని చెప్పారు. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 83.40-83.90 స్థాయిలో ఉండనున్నట్లు తెలిపారు.

టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ జట్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 19(నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దేశ వ్యాప్తంగా ఆవిష్కరణలను పెంపొందించడానికి, స్టార్టప్ కార్యకలాపాల పురోగతి సాధించడానికి ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. యువత ఆలోచనలను వ్యాపార నమూనాగా రూపొందించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, మార్గనిర్దేశం ఇచ్చేలా రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని తెలిపారు.

కార్పొరేట్లకు నో చాన్స్

ముంబై, జూలై 19: బ్యాంకుల ప్రమోటర్లుగా కార్పొరేట్లను అనుమతించే యోచనేదీ ప్రస్తుతానికి లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడ ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నకే పైవిధంగా బదులిచ్చారు. వ్యాపార సంస్థలు బ్యాంకులను ఏర్పాటుచేస్తే బ్యాంకింగ్ ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు.